క్లుప్తంగా

నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామికం


కొండపల్లి శ్రీనివాసరావు

ఏలూరు (టూటౌన్): చాలా చిన్న కారణంతో తాన నామినేషన్‌ను తిరస్కరించడం అప్రజాస్వామికమని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఏలూరులో సోమవారం మాట్లాడుతూ నామినేషన్ తిరస్కరణపై ఈ నెల 13న హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసినట్టు చెప్పారు. అది ఈనెల 18న హైకోర్టు బెంచ్‌కి రాబోతున్నదని తెలిపారు. ఎన్నికల సీఈఓకు కూడా నోటీసులు పంపించినట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వం నిలబెట్టిన అభ్యర్థికి గట్టి పోటీ ఇచ్చే స్వతంత్ర అభ్యర్థులను 11 మందిని స్క్రూటినీలో రిజెక్ట్ చేశారని ఆరోపించారు. అధికారులంతా అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారన్నారని దుయ్యబట్టారు. తనకు న్యాయం జరిగేంత వరకు న్యాయ స్థానాల్లో పోరాటం చేస్తానని, అవసరమైతే సుప్రీంకోర్టుని కూడా ఆశ్రయిస్తానని శ్రీనివాస్ వెల్లడించారు.

వైవీ రావు సేవలు ఆదర్శనీయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏపీ జేఏసీ అమరావతి ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన వైవీ రావు చేసిన కృషి ఆదర్శనీయమని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు రీజియన్ చైర్మన్ కేవీ రాఘవులు పిలుపునిచ్చారు. వైవీ రావు ద్వితీయ వర్ధంతి సభ స్థానిక ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం కపర్ది భవనంలో ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ చైర్మన్ రాఘవులు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. వైవీ రావు చిత్రపటానికి ఏపీ జేఏసీ అమరావతి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ కె.రమేష్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైవీ రావు సేవలను నాయకులు గుర్తుచేశారు.

శ్యాం శంకర్ మృతి తీరని లోటు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ ఉద్యోగి, ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యుడు డి.శ్యాం శంకర్ అకాల మరణం సేవా రంగానికి తీరని లోటని ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యుడు సురేష్ కుమార్ అన్నారు. ఇటీవల మృతి చెందిన శ్యాం శంకర్ సంతాప సభ స్థానిక తూర్పు వీధిలో ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేశారు. శ్యాం శంకర్ ఆత్మకు శాంతి కలగాలని కోరారు. సత్తెనపల్లి రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే


పాత బస్టాండ్ సెంటర్‌లోని ఆటో స్టాండ్ మెయిన్ రోడ్డు వద్ద చెత్త కుప్ప


ఏలూరు 18వ డివిజన్ గొల్లాయిగూడెంలో చెత్త కుప్ప

- నిలిచిన క్లాప్ ఆటోల సేవలు
- పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- నగర ప్రజలకు ఇబ్బందులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల ఒకటో తేదీ నుంచి ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఇంటింటి చెత్త సేకరించే క్లాప్ ఆటోల సేవలను నిలుపుదల చేశారు. చెత్త సేకరణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామంటూ కార్పొరేషన్ అధికారులు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో అది ఎక్కడా కన్పించడం లేదు. దీంతో నగరంలో ఎక్కడి చెత్త అక్కడే కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఏలూరు నగర పరిధిలోని 50 డివిజన్లలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోతోంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు, ఆస్పత్రులకు వెళ్లే మార్గం, అధికారుల కార్యాలయాల బయట ఇలా ఆయా ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. దీంతో నగర ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించే విధంగా చూడాల్సిన కార్పొరేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారంటూ ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు.

ఎక్కడ చూసినా చెత్త దర్శనం

ఏలూరు నగరంలో ఏ మూల చూసినా చెత్త దర్శనమిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే పాత బస్టాండ్ ఎదురుగా ఆటో స్టాండ్ పక్కనే పెద్ద చెత్త కుప్ప ఏర్పడింది. దీని వల్ల ఆటోలు ఎక్కేవారు, బస్సులు దిగేవారు ఇబ్బంది పడుతున్నారు. ఎన్ఆర్‌పేటలోని ఆసుపత్రి, కాలేజీలు ఉండే ప్రాంతానికి వెళ్లే మార్గంలో చెత్త కుప్పలు పేరుకుపోయి ఉన్నాయి. స్థానిక 18వ డివిజన్ గొల్లాయగూడెం, వంగాయగూడెం వంటి ప్రాంతాల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇలా వన్ టౌన్, టూ టౌన్ ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. చెత్త కుప్పలను తొలగించాలని ఆయా ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



నగర పాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో పారిశుద్ధ్య పనులపై అధికారులు శ్రద్ధ పెట్టాలి. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు వచ్చి వెళ్లే మార్గంలో అద్దంలా చేయిస్తున్నారు. ఆ ప్రాంతంలో చూపించే శ్రద్ధ ఇతర ప్రాంతాల్లో చూపడం లేదు. మారుమూల ప్రాంతాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు పేరుకు పోతున్నాయి. తక్షణం చెత్త కుప్పలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– బి.నాగరాజు, స్థానికుడు, గొల్లాయగూడెం, ఏలూరు

చెత్త రహితం.. ప్రతిజ్ఞలకే పరిమితం



స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏలూరు నగరాన్ని చెత్త రహిత నగరంగా తీర్చి దిద్దుతామంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిజ్ఞలు చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తుంది. నిర్దిష్టమైన ప్రణాళికతో నగరంలోని ప్రధాన కూడళ్లల్లో చెత్తను తొలగించే విధంగా కార్పొరేషన్ అధికారులు పనిచేయాలి. స్వచ్ఛ ఏలూరు దిశగా పనిచేయాలి. అందుకు తగిన నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు సాగాలి.

– గారపాటి నాగేశ్వరరావు, ఏలూరు

హామీలను విస్మరించిన కూటమి నాయకులు


భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


భీమడోలు ఇన్‌చార్జి పీఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

భీమడోలు: అంగన్‌వాడీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ధర్నా చేసారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నా కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు సంఘీభావం తెలిపారు. వివిధ మండలాల నుంచి వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది కూటమి ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా శిబిరాన్ని సందర్శించిన ఆర్.లింగరాజు మాట్లాడారు. రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నేటికీ అమలు చేయడం లేదన్నారు. గతేడాది అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలపై సమ్మె చేయగా కూటమి నాయకులు శిబిరాలకు వచ్చి తాము అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, గద్దెనెక్కి 9 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని విమర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు పెంచాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలును ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేయాలని, కరెంట్, టీఏ బిల్లులు, అద్దెలు ఏన్నో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు.అనంతరం ఇన్‌చార్జి పీవోకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు స్వర్ణకుమారి, ప్రాజెక్టు నాయకురాలు సుజాత, రత్నకుమారి, ఝాన్సీ, శాంతకుమారి, విజయకుమార్, వివిధ మండలాల కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

6న చలో విజయవాడను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న భజంత్రీ శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేస్తూ మున్సిపల్ శాఖకే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ, కార్మికుల బాధ్యత ఉంటుందని ప్రకటించడాన్ని నిరసిస్తూ మార్చి 6న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాస్, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాస్ డాంగే పిలుపునిచ్చారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు నగర సమితి సమావేశం స్థానిక స్ఫూర్తి భవనంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షులు యలగాడ దుర్గారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. భజంత్రీ శ్రీనివాస్, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాస్ డాంగే మాట్లాడారు. కార్మిక హక్కుల పరిరక్షణకు, ప్రభుత్వం రంగ సంస్థల పరిరక్షణకు మున్సిపల్ శ్రేణులు క్రియాశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట సంఖ్యను పొందాలి


రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ సుబ్బారావు

దెందులూరు: రైతులందరూ విశిష్ట సంఖ్యను విధిగా పొందాలని వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు అన్నారు. సోమవారం ఆయన సోమవరప్పాడు రైతు సేవ కేంద్రం వద్ద రైతు విశిష్ట సంఖ్య నమోదును ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు విధిగా రైతు విశిష్ట నంబరును పొందాలన్నారు. విశిష్ట సంఖ్య నమోదు కోసం రైతు సేవ కేంద్రాలు, వ్యవసాయ శాఖ సహాయకులను కలవాలన్నారు. వారి వద్దకు వెళ్లేటప్పుడు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ , పంట వివరం తెలిపే పట్టాదారు పాస్ పుస్తకం సమాచారాన్ని వారికి ఇవ్వాలన్నారు. రైతులకు విశిష్ట సంఖ్య కేటాయించిన అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, రాయితీలు నేరుగా వారి ఫోన్ నంబరు లింక్ చేసిన బ్యాంకు ఖాతాకు జమ చేస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే మండల వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు విశిష్ట సంఖ్యపై సేవలు అందిస్తున్నారని ఈ సౌకర్యాన్ని రైతులు వినియోగించుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు కోరారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటకం


శంబరాసుర వధ నాటకంలోని ఒక సన్నివేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో 93వ వార్షిక రామకోటి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి సహస్ర నామ పూజలు, నిత్య హోమం, నిత కళ్యాణ ం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు దొండపాడు శ్రీనం దత్తనాథ క్షేత్రం ఆధ్వర్యంలో సామూహిక అనఘాష్టమి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం హరిద్వార్ దాసభారతి ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ నెల్లూరుకు చెందిన పరాయతం నారాయణాచార్యులు భాగవతార్ భక్త జయదేవ అనే అంశంపై హరికథా కాలక్షేపం చేశారు. రాత్రి 7.30 గంటలకు గరికపాటి ఆర్ట్స్ థియేటర్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన శంబరాసుర వధ పౌరాణిక నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత గరికపాటి ఆర్ట్స్ థియేటర్ డైరెక్టర్ గరికపాటి కాళిదాసు, సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తం, హేళాపురి కళాకారుల సంక్షేమ సంఘం కార్యదర్శి ఎండీ ఖాజావలి నాటకం ప్రదర్శించిన నటులను దుశ్శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు.

వీఆర్వోల సమస్యలపై స్పందించాలి


పెదపాడు మండల వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

పెదపాడు : వీఆర్వోల సమస్యలపై సభ్యులు స్పందించాల్సిన అవసరముందని జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రామానుజం శ్రీరామ చంద్రమూర్తి తెలిపారు. పెదపాడు గ్రామ రెవెన్యూ అధికారి కార్యాలయం వద్ద మండలంలోని వీఆర్వోలతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్వోలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను సమీక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో మందుండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, కె నటరాజన్‌దాసు, జి ప్రభాకరరావు, బీ. కోటేశ్వరరావు, అల్లు ప్రసాద్, మురళీకృష్ణ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	28
వంకాయలు (కాంతులు)	24	బీన్స్ చిక్కుడు	36
వంకాయలు (తెలుపు)	18	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	72
కాకర కాయలు	30	బీట్‌రూట్	32
బీరకాయలు (పందిరి)	54	కీరా దోస	44
కాలీఫ్లవర్	00	ఫ్రెంచ్‌బీన్స్	60-72
క్యాబేజీ	16	అల్లం	50
క్యారెట్	32	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	26	పాలకూర	10
బంగాళదుంపలు	28	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	32	గోంగూర	07-10
దోసకాయలు	30-38	పుదీనా	05
ఆనపకాయ (1)	20-25	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్ఈఎల్ స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్	22.30	13
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	32
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	36
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

చికెన్ షాపులు వెలవెల.. వ్యాపారులు విలవిల

- చికెన్ ధర ఢమాల్
- పలు దుకాణాలు తాత్కాలికంగా మూసివేత
- మంట పుట్టిస్తున్న మటన్ ధర
- చేప, రొయ్యలు, పీతల ధరలకు రెక్కలు


గణపవరంలో వారపుసంత రోజైన సోమవారం ఖాళీగా చికెన్ దుకాణం

గణపవరం: బర్డ్‌ఫ్లూ కలకలం రేగడంతో ఉంగుటూరు నియోజకవర్గంలో చికెన్ వ్యాపారం పూర్తిగా చతికిలపడిపోయింది. కొనుగోలు చేసే నాథుడులేక దుకాణాలు వెలవెల బోతున్నాయి. కొన్ని చికెన్ దుకాణాలను మూసి వేశారు.

స్తంభించిన చికెన్ కొనుగోళ్లు

బర్డ్‌ఫ్లూ వ్యాపించడంతో నియోజకవర్గంలోని పలు పౌల్ట్రీ ఫారాల్లో లక్షల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. కళ్లముందే కోళ్లను బర్డ్‌ఫ్లూ కబళిస్తుంటే రైతులు ఏమీ చేయలేక చేష్టలుడిగి చూస్తూ ఉండిపోతున్నారు.

లక్షల సంఖ్యతో కోళ్లు మృత్యువాత

బర్డ్‌ఫ్లూ దెబ్బతో చికెన్ తినాలంటేనే ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. చికెన్ ధర సగానికి సగం తగ్గించి విక్రయిస్తున్నా వినియోగదారులు చికెన్ దుకాణాల వైపు కన్నెత్తి చూడటంలేదు. గణపవరం, నిడమర్రు మండలాల్లో హోల్‌సేల్, రిటైల్ చికెన్ దుకాణాలు దాదాపు 200 పైగానే ఉన్నాయి. గణపవరం మండలంలోని కేశవరం, ముప్పర్తిపాడు, మొయ్యేరు, కోమర్రు తదితర గ్రామాల్లో పది వరకు కోళ్ల ఫారాలున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఉంగుటూరులోని కోళ్ల ఫారాల్లో బర్డ్‌ఫ్లూ విజృంభించడంతో లక్షల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి.

చేపలు, మేక మాంసం దుకాణాల వద్ద రద్దీ

గణపవరం మండలంలో బర్డ్‌ఫ్లూ వ్యాపించినట్లు ఇంత వరకూ నిర్ధారణ కాలేదు. అయినా కోడిమాంసం తినడానికి జనం భయపడుతున్నారు. వారం రోజుల క్రితం కిలో రూ.240 నుంచి రూ.250 పలికిన చికెన్ ధర ప్రస్తుతం సగానికి సగం అంటే కిలో రూ.120కి పడిపోయింది. అయినా చికెన్ దుకాణాల్లో బోణీ కావడంలేదని వ్యాపారులు వాపోతున్నారు. ఇదే అదనుగా వేట మాంసం, చేప, రొయ్యలు, పీతల ధరలకు రెక్కలొచ్చాయి. మటన్ కిలోరూ.700 నుంచి రూ.800కు విక్రయించేవారు. ప్రస్తుతం మటన్ ధర కిలోరూ.1000 నుంచి రూ.1100 చేరింది. చేప ధర కూడా కిలో రూ.130 నుంచి రూ.160కు పెరిగింది. ఎంత ధరైనా మాంసాహార ప్రియులు లెక్కచేయడంలేదు. మటన్, చేప దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. ఏటా సీజన్‌లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకడం సర్వ సాధారణమే అయినా ఈప్రాంతంలో ఇంతగా ఎప్పుడూ వ్యాధి తీవ్రత ఇంతగా లేదు. అందువల్ల చికెన్ అమ్మకాలు కొంతమేర తగ్గినా ఇంత గడ్డు పరిస్థితి ఉండేది కాదని ఫారాల యజమానులు అంటున్నారు. ఈ ఏడాది మాత్రం నియోజకవర్గంలో ఉంగుటూరు మండలంలో బర్డ్‌ఫ్లూ వ్యాధి విజృంభించడంతో ఈప్రాంత ప్రజలు చికెన్ కొనుగోలుకు ముందుకు రావడం లేదు. బర్డ్‌ఫ్లూ మనుషులకు సోకదని, బాగా ఉడకబెట్టిన చికెన్, గుడ్లు తినవచ్చునని వైద్యనిపుణులు చెబుతున్నా కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితి ఇంకా ఎంతకాలం ఉంటుందోనని చికెన్ వ్యాపారులు వాపోతున్నారు.

గుడ్డుదీ అదేదారి

బర్డ్‌ఫ్లూ దెబ్బ కోడిగుడ్లపై కూడా పడింది. రూ.7 ఉండే కోడి గుడ్డును రూ.4కే ఇస్తామన్నా కొనేవారు కనిపిచడంలేదని వ్యాపారులు వాపోతున్నారు. పలు దుకాణదారులు వారానికి సరిపడ కోడిగుడ్లు వేయించుకుని వాటిని విక్రయించలేక బయట పారవేసే పరిస్థితి వచ్చింది.

విందు భోజనాల్లో చికెన్ మాయం

మాంసాహార వంటకాలలో చికెన్‌దే అగ్రస్థానం. చికెన్ కర్రీ, చికెన్ ఫ్రైలో ఏదో ఒకటి ఉండి తీరాల్సిందే. అయితే వారం రోజులుగా జరిగిన ఏ ఫంక్షన్‌లోనూ చికెన్ కూర మచ్చుకు కూడా కనిపించడం లేదు. హోటళ్లు, రెస్టారెంట్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లలో సైతం చికెన్ వినియోగం పూర్తిగా నిలిపివేయడంతో చికెన్ విక్రయాలు జరగడం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

పక్షుల ద్వారా వ్యాపించే అవకాశం

గణపవరం మండలంలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ లక్షణాలు నమోదుకాలేదు. రెండు రోజులుగా మొయ్యేరు, ముప్పర్తిపాడు, కేశవరం, కోమర్రు, డికుముదవల్లి ప్రాంతాల్లో కోళ్ల ఫారాలను తనిఖీచేశాం. పౌల్ట్రీ యజమానులకు పలు సూచనలు చేసి, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చాం. బర్డ్‌ఫ్లూ ఇంత వరకూ మను షులకు సోకిన దాఖలాల్లేవు. చికెన్, గుడ్లు బాగా ఉడికించి తినడంవల్ల ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

– నాయక్, పశుసంవర్ధకశాఖ ఏడీ

అసత్య ప్రచారాలతోనే ఇబ్బంది

బర్డ్‌ఫ్లూ వ్యాప్తి అక్కడక్కడా కనిపిస్తోంది. ప్రచార మాధ్యమాలలో దీనిపై విస్తృతంగా ప్రచారం చేయడంతో కరోనా కంటే భయంకర వ్యాధిగా ప్రజల్లో అపోహలు వచ్చి, చికెన్‌కు పూర్తిగా దూరమయ్యారు. మా షాపులో రోజూ రిటైల్‌గా నాలుగు నుంచి ఐదు వందల కోళ్లు విక్రయించేవాళ్లం. వారం రోజులుగా 30 నుంచి 40 కోళ్లు కూడా విక్రయించలేదు. ప్రభుత్వం చికెన్ వ్యాపారులను ఆదుకోవాలి.

– బందారు రంగా, చికెన్ వ్యాపారి, గణపవరం

సాయం అభినందనీయం

ఉంగుటూరు: పాఠశాలలకు దాతలు సాయం అందించడం అభినందనీయమని ఉపాధ్యాయులు అన్నారు. కొత్తగూడెం, నాచుగుంట పాఠశాలకు దాత దాసరి కృష్ణకుమారి ఎలక్ట్రికల్ బెల్ పరికరాలను పరికరాలను అందజేశారు. సోమవారం పాఠశాల హెచ్ఎం కోమ్మోజు వెంకటేశ్వరరావుకు రూ.4వేలు విలువ చేసే ఎలక్ట్రికల్ బెల్ పరికరాలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా దాత కృష్ణకుమారికి పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేశారు. పాఠశాల తల్లిదండ్రులు, యాజమాన్య కమిటీ చైర్మన్ కోమటి దేవి, సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్లో సమస్యలు పరిష్కరిస్తాం

దెందులూరు : కొవ్వలి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా రూ.16.25 లక్షలు మంజూరయ్యాయని సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి రమేష్ అన్నారు. సోమవారం కొవ్వలి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్‌డబ్ల్యూఓ రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌గా ఉన్న కొవ్వలి హాస్టల్ ఆధునీకరణకు రూ.16.25 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో హాస్టల్లో బాత్‌రూమ్ డోర్లు ఏర్పాటుకు, లైట్ల మరమ్మత్తులు తదితర సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కొద్ది రోజుల్లోనే అన్ని సమస్యలను పరిష్కరించి హాస్టల్ విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తామన్నారు. ఆధునీకరణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేయాలని ఏఈ సత్యనారాయణకు సూచించారు. అభివృద్ధి పనులను హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పర్యవేక్షించాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు గోల్డెన్ రాజు, భీముడు ఉన్నారు.